క్లుప్తంగా

'శిక్షా సప్తాహ్' విజయవంతంగా పూర్తి

బాలాజీచెరువు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా విద్యాశాఖాధకారి పిల్లి రమేష్ పేర్కొన్నారు. స్థానిక తిలక్‌స్ట్రీట్ మున్సిపల్ పాఠశాలలో శనివారం సహాబంతి భోజన కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమానికి సహకరించిన దాత అల్లాడ సూర్యప్రకాష్‌ను, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో అర్బన్ మండల విద్యాశాఖాధికారి చెవ్వూరి రవి,హెచ్‌ఎం గౌరీశంకర్ పాల్గొన్నారు.

నేడే రాంషా శతజయంతి సభ

బోట్‌క్లబ్: ప్రసిద్ధ సాహిత్యవేత్త అభిసారిక దాంపత్య విజ్ఞాన మాస పత్రిక పూర్వ సంపాదకులు రాంషా శతజయంతి సభ మంగళవారం సాయంత్రం 4 గంటలకు రోటరీ సర్వీస్ సెంటర్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు డాక్టర్ పూషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనతో సాహిత్యంలో పరిచయం ఉన్న వ్యక్తులు ఈ సమావేశంలో పాల్గొవచ్చని ఆయన కోరారు.

దివ్యాంగులకు పరికరాల అందజేత



వినికిడి యంత్రం అందజేస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో దివ్యాంగుల వీల్ చైర్, వినికిడి యంత్రాలు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న నలుగురు వ్యక్తులకు సోమవారం అందజేశారు. కాకినాడ అర్బన్‌కి చెందిన జొన్నాడ జోగేశ్వరస్వామి, మండపేటకు చెందిన కడారి మణికు వీల్ చైర్లను, కాకినాడ అర్బన్‌కు చెందిన గుర్రాని సత్యనారాయణ, పెద్దాపురానికి చెందిన పండునాడ జయదీప్తికు వినికిడి యంత్రాలను కలెక్టర్ ఆదేశాల ప్రకారం జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పేనాయక్, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, జిల్లా విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఇన్‌చార్జి సహాయ సంచాలకులు పి.నారాయణమూర్తి దివ్యాంగులకు వీల్ చైర్, వినికిడి యంత్రాలు అందజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ రూరల్ మండలం చీడిగలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూరంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.మౌనిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి అదనంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్ రైజ్ సేవలు అభినందనీయమన్నారు. 60 మంది గర్భిణులు, బాలింతలకు ప్రొటీన్ పౌడర్, పండ్లు, చెక్కిలు, ఖర్జూరం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీకృష్ణ వర్మ సెక్రెటరీ సాయి సుంద, క్లబ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ చైర్ పర్సన్ ఎం.విజయలక్ష్మి, సభ్యులుపాల్గొన్నారు.

గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలి

బోట్‌క్లబ్: గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆర్డినెన్సు ప్రకారం విలీనం అయ్యే 6 అర్బన్ గ్రామాల రికార్డులు కాకినాడ నగర పాలక సంస్థ అజమాయిషీలో ఉండాలని పౌర సంక్షేమ సంఘం పేర్కొంది. 2017 కాకినాడ ఎన్నికల ముందు వాటిని వెనక్కి ఇవ్వడంతో మరో 2 గ్రామాల సాంకేతిక సమస్యతో 42, 48 డివిజన్లలో స్థానిక పాలన నిలిచిపోయిందన్నారు. సోమవారం ఉదయం స్థానిక జవహర్‌వీధిలోని వివేక్ భవన్‌లో పౌర సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. కాకినాడ నగర పాలక సంస్థ తక్షణమే గవర్నర్ ఆర్డినెన్సు ప్రకారం 6 గ్రామాల విలీనానికి చెందిన పంచాయతీ రికార్డులు కార్పొరేషన్ స్వాధీనంలో ఉంచాలన్నారు. పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ త్వరలో 8 అర్బన్ గ్రామాల విలీన సాధనపై విస్తృత స్థాయి సదస్సు వాకలపూడిలో జరుగుతుందన్నారు. సమావేశంలో తిరుమల శెట్టి నాగేశ్వరరావు, పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజయ్ కుమార్, జుత్తుక రమణ, మేడిశెట్టివేంకట రమణ, సలాది శ్రీనివాస బాబు, జోగా అప్పారావు తటవర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త న్యాయ చట్టాలు మానవ హక్కులకు భంగకరంగా ఉన్నాయని పలువురు నాయకులు తెలిపారు. ఆదివారం రాత్రి కచేరిపేట యూటీఎఫ్ టీచర్స్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కొత్త న్యాయ చట్టాలు–పర్యవసానాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఐద్వా నగర కార్యదర్శి, న్యాయవాది కె.నాగజ్యోతి అధ్యక్షత వహించగా ప్రముఖ న్యాయవాది, మహర్షి సాంబమూర్తి సంస్థ అధ్యక్షుడు మహ్మద్ జవహర్ అలీ పాల్గొని ప్రసంగించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వి శ్రీరామారావు, ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎస్ గోవిందరాజులు, మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

- నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు
- సక్రమంగా అద్దె చెల్లించని వ్యాపార సంస్థలు
- పట్టించుకోని అధికారులు



వలసపాకల వద్ద రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగ్



పెదకొత్తూరు వంతెన వద్ద విద్యుత్ స్తంభంపై ఓ వ్యాపార సంస్థ ప్రకటన

కరప: ఒకప్పుడు పట్టణాలకు పరిమితమైన హోర్డింగ్స్ (ప్రకటన బోర్డులు) ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. వ్యాపార, విద్యా సంస్థలు తక్కువ ఖర్చుతో తమ ఉత్పత్తులపై, అమ్మకాలపై ప్రచారం చేసేందుకు గ్రామీణ రహదారుల వెంబడి, గ్రామాల్లోనూ హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వివిధ వ్యాపార సంస్థలు, వ్యాపారస్తులు ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయడం వాటికి అద్దె చెల్లించకపోవడంతో ప్రభుత్వాదాయానికి గండి పడుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ప్రజలను ఆకర్షించేలా భారీ సైజులో రోడ్డు పక్కనే హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికుల, పాదచారుల దృష్టి వాటిపై మళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు.

ఎక్కడపడితే అక్కడే ఏర్పాటు

హోర్డింగులు ఏర్పాటు చేసే వ్యాపారస్తులు ప్రభుత్వానికి సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో ప్రధానంగా గ్రామ పంచాయతీలు తమకు వచ్చే ఆదాయాలను కోల్పోవాల్సి వస్తోంది. ఎక్కడపడితే అక్కడ రోడ్ల వెంబడి ప్రధాన సెంటర్లలోనూ, గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలకు, భవనాలపైన వీటిని ఏర్పాటు చేస్తున్నారు. భారీసైజులో వీటిని ఏర్పాటు చేయడంతో ఎప్పుడు మీద పడతాయోనని ప్రజలు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారు.

అనుమతులు తప్పనిసరి

హోర్డింగ్‌ల ఏర్పాటు చేసేందుకు ముందుగా ఆయా భవన యజమానులు, పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసినట్టయితే విద్యుత్ శాఖ అనుమతి పొందాలి. ఆ హోర్డింగ్ కొలతల ఆధారంగా పంచాయతీకి, విద్యుత్ శాఖకు అద్దె చెల్లించాలి. హోర్డింగ్‌లు ఏర్పాటు చేసే స్థలం వివరాలు పంచాయతీలో నమోదై ఉండాలి.

ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా..

కాకినాడరూరల్ నియోజకవర్గ పరిధిలో కరప మండలంలో 23 గ్రామాలు, కాకినాడ రూరల్ మండలంలో 18 గ్రామాలు, అర్బన్‌లో ఆరు డివిజన్‌లో ఉన్నాయి. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మంత్రి పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచేలా చేస్తామంటున్నారే కానీ, ఆ దిశగా ఆలోచనలు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ రాజ్ మినిష్టర్ పవన్ కల్యాణ్ జీతం తీసుకోకుండానే పని చేస్తానంటున్నారు బాగానే ఉంది. అధికార పార్టీల నాయకులు గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలపై ట్యాక్స్ వసూలు చేసేలా చర్యలు తీసుకుంటే గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుంది కదా అని ప్రజలు అంటున్నారు. పెరిగిన రేట్లు ప్రకారం హోర్డింగులపై ట్యాక్స్ వేస్తే ఒక్కో పంచాయతీకి కనీసం రూ.30 వేలు వరకు ఆదాయం రావచ్చని అధికారులు అంటున్నారు.

అధికారులు పట్టించుకోక..

కరప మండలంలోని పలు గ్రామాల మీదుగా ఉన్న కాకినాడ–రావులపాలెం, కాకినాడ–కోటిపల్లి రహదారుల వెంబడి రోడ్లకు ఇరువైపుల నిబంధనలకు విరుద్ధంగా అనధికార హోర్డింగ్‌లు భారీ ఎత్తున వెలిశాయి. కాకినాడ పట్టణానికి చెందిన పలు వ్యాపార సంస్థలతో పాటు మండల గ్రామాలకు చెందిన వ్యాపార, విద్యా సంస్థలు ప్రధాన రహదారుల వెంబడి ఈ అనధికార హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. పలువురు స్థానికులు పలు రకాల స్లోగన్స్ వివరిస్తూ, సినీనటులకు, రాజకీయ నాయకులకు అభినందనలు తెలియ జేస్తూ, వివిధ వ్యాపార, విద్యా సంస్థలు, ఆసుపత్రులు స్వచ్ఛందంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. గ్రామ పరిధిలో హోర్డింగ్‌లకు సైజులను బట్టి కనీసం రూ.100 నుంచి రూ.800 వరకూ పంచాయతీలకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసే చిన్న చిన్న ప్రకటన బోర్డులకు రూ.50 నుంచి రూ.100 వరకూ ట్రాన్స్‌కోకు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రచార హోర్డింగ్‌ల ద్వారా పంచాయతీలకు ఏటా వేలాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా అధికారులు వీటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రమాదాలకు కారణం

వ్యాపారులు ప్రధాన రహదారులు, మలుపుల్లోను, కూడళ్లు, ప్రధాన సెంటర్లలో ఈ ప్రచార బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ఈ బోర్డులను పరిశీలిస్తూ ఎదురుగా వచ్చే వాహనాలను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మార్జిన్లలో హోర్డింగులు ఏర్పాటు చేయడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకునేందుకు పక్కకు వెళ్లేందుకు చోటు లేక ప్రమాదాలు జరుగుతున్నట్టు వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కన ప్రమాదభరితంగా ఏర్పాటు చేస్తున్న ఈ హోర్డింగ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసుల జారీకి చర్యలు తీసుకుంటాం



మండల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వివిధ చోట్ల ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులపై రుసుం వసూలు చేస్తాం. గ్రామాల్లోను, రహదారుల పక్కన నిబంధనలకు అనుగుణంగా హోర్డింగుల ఏర్పాటు చేసికోవచ్చు. అయితే ఆ బోర్డుల సైజును బట్టి పంచాయతీకి ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థలకు నోటీసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచుకునేలా చూస్తాం.

– బీఏ సత్యనారాయణ, ఈఓపీఆర్డీ, కరప మండలం.

ఆదాయం వచ్చేలా చూస్తాం



గ్రామపరిధిలో పంచాయతీ అనుమతిలేకుండా వ్యాపార సంస్థలు ప్రకటన బోర్డులు ఏర్పాటు చేశారు. అధికారులతో చర్చించి, పంచాయతీకి ఆదాయం వచ్చేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటాం.

–సాదే ఆశాజ్యోతి, సర్పంచ్, కరప.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు

- పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- రెవెన్యూ.శానిటేషన్ అధికారులకు కమిషనర్ భావన ఆదేశం



రెవెన్యూ, పారిశుధ్య విభాగానికి చెందిన అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారుల ఆదేశించారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సీజనల్ వ్యాధులు, మెరుగైన పారిశుద్ధ్య సేవలు, పన్నుల వసూలుపై రెవెన్యూ, పారిశుద్ధ్య విభాగానికి చెందిన అధికారులతో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ, అతిసార, మలేరియా వంటి వ్యాధులు రాకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా వారానికి ఒక్కరోజు మాత్రమే చేస్తున్న ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని మంగళవారం కూడా కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్ శానిటరీ సూపర్‌వైజర్లు సత్తిప్ప నాయుడు, రాంబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల పనుల పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. సోమవారం ఆమె జగన్నాథపురం అన్నమ్మగాటి సెంటర్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం



అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్ షాన్ మోహన్, డీఆర్వో డి.తిప్పేనాయక్, జెడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, సీపీవో పి.త్రినాథ్, డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 404 అర్జీలు అందాయని, వాటిని ఆయా శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

మంచి నీరు కొనుక్కొనే దౌర్భాగ్యం పోవాలి

- మండల పరిషత్ సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే నానాజీ
- అక్రమ కనెక్షన్లను తొలగించాలని ఆదేశం
- ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షతన సాధారణ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంతం నానాజీ. చిత్రంలో ఎంపీపీ విరీష తదితరులు

కాకినాడ రూరల్: చాలా గ్రామాలలో రంగు మారిన నీరు కుళాయిల నుంచి వస్తుందని ఫిర్యాదులు వస్తున్నాయని, తక్షణమే ఆ సమస్యను పరిష్కరించడంతో పాటు మంచినీటిని కొనుక్కొనే దౌర్భాగ్యం పోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం ఉదయం ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షన మండల పరిషత్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే నానాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శాఖల వారీగా సమీక్షించారు. అధికారులను ఆయా శాఖల వివరాలు తెలుసుకోవడంతో పాటు తన సందేహాలను తీర్చుకునేందుకు అధికారులకు ప్రశ్నలు సంధించారు. అవగాహన పెంచుకోవడానికి వివరాలు అడుగుతున్నానని అన్నారు. గ్రామాలలో తాగునీరు, పారిశుద్యపై అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో జరిగే అభివృది, సమస్యలను వివరించారు. ఎంపీపీ బందిలి విరీష కాకినాడ రూరల్ మండల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ రమేష్‌నాయుడు మండలంలో అభివృద్ధి గురించి తెలియజేశారు. ఎక్సైజ్, బీసీ, సంక్షేమ శాఖ సిబ్బంది సమావేశానికి హాజరవ్వలేదు.

ఎన్నికల వరకే రాజకీయాలు

ఎన్నికల వరకే రాజకీయాలని, పార్టీలకు అతీతంగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. మండల సమావేశంలో స్టేజిపైకి జనసేన, టీడీపీతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులను ఆయన ఆహ్వానించారు. నానాజీకి అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు.

మండల సమావేశంలో ప్రొటోకాల్‌కు తూట్లు

కాకినాడ రూరల్: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ బందిలి విరీష అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే పంతం నానాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ రమేష్‌నాయుడు, తహసీల్దార్ విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎటువంటి ప్రొటోకాల్ లేని, ప్రజాప్రతినిధులు కానీ టీడీపీ కాకినాడ రూరల్ కో కన్వీనరు కటకంశెట్టి బాబీ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కరేడ్ల గోవిందు స్టేజిపైకి వచ్చి కుర్చీలలో అల్లుకుపోయారు. అంతే కాదు ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు వెనక కాకుండా ముందు వరసలో కూర్చొని అధికార దర్పం ప్రదర్శించారు. సభ్యులు కాని వారు సమావేశంలో ప్రశ్నలు అడగవద్దని చెప్పినా పట్టించుకోకుండా ఉన్నారు. ఎంపీడీఓ రమేష్‌నాయుడు పక్కనే ప్రజాప్రతినిధులు కాని వారు కుర్చీలో ఉన్నా పట్టించుకోలేదు. దీంతో విమర్శలు వెల్లువెత్తాయి.

సమస్యలు సత్వరం పరిష్కరించండి

కాకినాడ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క సమస్యనూ సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని, అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, యూపీఏ విభాగాలకు సంబంధించి 17 మంది ఫోన్ ద్వారా సమస్యలు విన్నవించారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భాగంగా నరపాలక సంస్థ కార్యాలయంలో నేరుగా ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్,మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, పలువురు డీఈలు, ఏఈలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



వేలంగిలో ఆక్రమణదారునితో మాట్లాడుతున్న అధికారులు

కరప: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని వ్యాపారాలుచేసినా, కట్టడాలు నిర్మించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కె.అప్పారావు హెచ్చరించారు. మండల వేలంగిలోని కూరాడరోడ్డులో ఆర్ అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించుకుని షాపునిర్మాణం చేశారని, శివారు కొప్పిశెట్టివారివీధి వద్ద పంచాయతీ చెరువుగట్టును ఆక్రమించుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారని పీజీఆర్ఎస్(ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ)లో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్ షామోహన్ ఆదేశాలతో ఎంపీడీఓ అప్పారావు, ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఆర్అండ్‌బి ఏఈఈ కె.సాయిబాబా, గ్రామకార్యదర్శి పి.శ్రీనివాసరావులు ఆయా స్థలాలకు వెళ్లి ఆక్రమణదారులతో మాట్లాడారు. రెండు,మూడు రోజుల్లో ఆక్రమణలు పూర్తిగా తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనం శుచి, రుచికరంగా ఉండాలి

కరప: విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంటలు శుభ్రంగా, రుచికరంగా చేయాలని బీజేపీ కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలం గొర్రిపూడిలోని మండల, జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి తనిఖీ చేసి, భోజనపథకం నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. రాష్ట్రీయ హిందూ చైతన్య సదస్సు అధ్యక్షుడు పదాల రఘు, మండల బీజేపీ అధ్యక్షురాలు ఎర్రంనీడి పద్మావతి, రాష్ట్ర కిసాన్‌మోర్చ కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని అకౌంటెంట్ మృతి



ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన చంద్రబోస్

కాకినాడ క్రైం: ఆర్టీసీ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం ఓ నిండి ప్రాణాన్ని బలిగొంది. చార్టెడ్ అకౌంటెంట్‌గా ఉన్నత జీవితం వైపు అడుగులేస్తున్న ఆ యువకుడి ఆకాంక్షలను చిదిమేసింది. కుటుంబాన్ని కన్నీటి సంద్రంలోకి నెట్టింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ గ్రామీణం తూరంగి డ్రైవర్స్ కాలనీకి చెందిన రెడ్డి చంద్రబోస్(37) చార్టెడ్ అకౌంటెన్సీ(సీఏ) చదువుతూ ప్రైవేటుగా వలసపాకలలోని ఓ సంస్థలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని 4 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో టూ టౌన్ వంతెన వద్ద మెయిన్‌రోడ్ వైపు వెళుతున్న చంద్రబోస్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో చంద్రబోస్‌కు తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలేశ్వరం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు కాకినాడ బస్టాండ్ నుంచి రౌతులపాలెం వెళుతోంది. బస్సు డ్రైవర్ బి.శ్రీకాంత్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి జోగారావు ఫిర్యాదు మేరకు కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

కాకినాడ రూరల్: గంగనాపల్లి గ్రామానికి పంపన భాస్కర్(36) పురుగు మందు తాగి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంద్రపాలెం పోలీసులకు వివరాలు ప్రకారం.. రెండేళ్ల క్రితం భాస్కర్‌కు విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లిదండ్రులు వద్ద ఉంటున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన భాస్కర్ సోమవారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగు మందును తాగాడు. ఇంట్లో నుంచి బయటకు వచ్చి పడిపోయిన అతనిని కుటుంబ సభ్యులు కాకినాడ బాలాజీ చెరువు సెంటరు వద్ద ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మణికుమార్ తెలిపారు.

విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి

కరప: పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసిస్తున్న పిల్లలపై తల్లిదండ్రులు పర్యవేక్షణ ఉండాలని గ్రామసర్పంచ్ సాదే ఆశాజ్యోతి పేర్కొన్నారు. పిల్లల చదువుతో పాటు, అలవాట్లు, స్నేహాలు, వారిప్రవర్తన ఎలా ఉన్నది ప్రతిరోజూ తెలుసుకుంటూ ఉండాలన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రవేశపెట్టిన శిక్షా సప్తాహ కార్యక్రమ వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం పిల్లలకు స్వీట్లు అందించారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, స్టాఫ్‌సెక్రటరీ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పీడీ కె.శ్రీనివాస్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని హెచ్‌ఎం ఎ.సాయిమోహన ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల మూసివేత



డెయిరీ ఫారంలో మందుల దుకాణంలో అధికారుల తనిఖీ చేస్తున్న అధికారులు

కాకినాడ క్రైం: కాకినాడలో ఎటువంటి అర్హత లేకుండా ఆర్‌ఎంపీలుగా వైద్యం చేస్తున్న ముగ్గురిపై ఔషధ నియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలకు సిఫార్సు చేశారు. ఈమేరకు సోమవారం కాకినాడ పోర్టు పోలీసులతో కలిసి ఆయా క్లినిక్‌లు అనుబంధంగా కొనసాగుతున్న మందుల దుకాణాలలో తనిఖీలు చేశారు. నగరంలోని దుమ్ములపేటలో ఉన్న శివ క్లినిక్, సంజయ్ నగర్‌లో శ్రీకృష్ణ వేణి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, డెయిరీ ఫారంలో ఉన్న విజయదుర్గ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లతో పాటు అనుబంధ మందుల దుకాణాలు సురేష్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, సత్యశ్రీ మెడికల్ స్టోర్స్, వీరభద్ర మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. తగిన విద్యార్హత లేకుండానే వీటిని నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. ఈ తనిఖీల్లో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీడీ ఎం.పాండురంగ ప్రసాద్, ఏడీ సీహెచ్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో నలుగురు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ నుంచి డీపీఎంవో డాక్టర్ సురేఖ, డిప్యూటీ ఎస్‌వో గిరిగణేష్, పోర్టు ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సమకాలీన రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి

బాలాజీచెరువు: సమకాలీన రాజకీయాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరిగింది. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సమకాలిక రాజకీయ సామాజిక విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్యాంపస్ ఇన్‌చార్జి మూర్తి ఇటీవల ప్రవేశ పెట్టిన కేంద్ర ద్రవ్య బిల్లుపై చర్చలో మంచి ప్రతిభ ప్రదర్శించినందుకు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ చార్టర్ అకౌంటెంట్ కే.విజయబాబు కేంద్ర ద్రవ్య బడ్జెట్ గురించి సమగ్ర విశ్లేషణ చేసి విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలను ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కామర్స్ విభాగాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ అలీ, అధ్యాపకులు నరసింహారావు, స్రవంతి, రమణి ,గుల్షన్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.